క్లుప్తంగా

దైవభక్తితో మానసిక ప్రశాంతత



మహాపడి పూజలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తదితరులు

బంట్వారం: దైవభక్తితో మానసిక ప్రశాంతత లభిస్తుందని తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. గురువారం కోట్‌పల్లి మండల కేంద్రంలో మత్స్య సహకార సంఘం మాజీ అధ్యక్షుడు నక్కల బందయ్య నిర్వహించిన అయ్యప్పస్వామి మహా పడిపూజకు ఎమ్మెల్యే హాజరయ్యారు. స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, ఏఎంసీ చైర్మన్ అంజయ్య, మాజీ సర్పంచ్‌లు జ్ఞానేశ్వర్, విజయలక్ష్మి, నర్సింగ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తకు పరామర్శ



నర్సింహులును పరామర్శిస్తున్న తిరుపతి రెడ్డి తదితరులు

దుద్యాల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న కాంగ్రెస్ కార్యకర్త నర్సింహులు(అయ్యప్ప మాలధారుడు)ను ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతి రెడ్డి గురువారం పరామర్శించారు. మండల పరిధి కుదురుమల్ల గ్రామానికి చెందిన నర్సింహులు.. దుద్యాలలో పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సవానికి హాజరై తిరిగి వస్తుండగా.. గేట్ సమీపంలో కుక్క అడ్డు రావడంతో బైక్ అదుపుతప్పింది. ఈ ఘటనలో ఆయనకు స్వల్ప గాయాలు అయ్యాయి. ప్రస్తుతం కోస్గి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరామర్శించిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు ఆవుటి శేఖర్, నాయకులు రమేశ్ తదితరులు ఉన్నారు.

సభను జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

అనంతగిరి: సీపీఐ(ఎంఎల్), న్యూ డెమొక్రసీ రెండు పార్టీల విలీన సభను విజయవంతం చేయాలని వికారాబాద్ జిల్లా కార్యదర్శి మహేందర్ పిలుపునిచ్చారు. గురువారం వికారాబాద్‌లో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 28న నగరంలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సభ జరగనుందని, ఇందులో జాతీయ నాయకులు పాల్గొననున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గీత, రాములు, ప్రభావతి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహా పడిపూజ



అయ్యప్పస్వామి శోభాయాత్ర

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం రాత్రి అయ్యప్పస్వామి పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం పట్టణంలోని హనుమాన్ మందిరం నుంచి స్వామి వారి చిత్ర పటం, ఆభరణాలతో ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోండి



రోగులతో వైద్య సిబ్బంది

కుల్కచర్ల: ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని డాక్టర్ వాజియోద్దీన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 42 మందికి శుక్లాల వ్యాధి, 23 మందికి బీపీ షుగర్, 19 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులు, కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో అప్తాల్మిక్ అధికారి జవహర్ లాల్, ఏఎన్ఎం సూజాత, ఆసుపత్రి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అప్పుల ఊబిలో ‘మాజీ’లు

- పంచాయతీ బిల్లులు పెండింగ్
- బకాయిల చెల్లింపులో నిర్లక్ష్యం వీడాలని మాజీ ప్రజాప్రతినిధుల వేడుకోలు

దౌల్తాబాద్: ప్రజా సమస్యల పరిష్కారంలో కీలకంగా వ్యవహరించిన మాజీ ప్రజాప్రతినిధులు అప్పుల పాలై అవస్థలు పడుతున్నారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు రాకపోడంతో దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. బిల్లుల చెల్లింపు విషయంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అప్పట్లో చేపట్టిన పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో.. కష్టనష్టాలకు ఓర్చి తామే పనులు పూర్తి చేశామంటున్నారు. అభివృద్ధి పనులు చేయాలంటూ ఒత్తిడి చేసిన అధికారులు, ద్వితీయ శ్రేణి నాయకులు ప్రస్తుతం తమ సమస్యను పట్టించుకోవడం లేదని నిట్టూరుస్తున్నారు.

ఎస్టీఓల్లో మూలుగుతున్న చెక్కులు..

పంచాయతీల్లోని సమస్యల పరిష్కారం, అత్యవసర పనుల కోసం మాజీ సర్పంచ్‌లు పెద్ద ఎత్తున అప్పులు తెచ్చి పెట్టారు. రెండేళ్ల క్రితమే ఎంబీ రికార్డులు చేసి, ఎస్టీఓలకు బిల్లులు పంపారు. అయితే అక్కడ ఫ్రీజింగ్ పేరుతో పెండింగ్‌లో ఉంచారని చెబుతున్నారు. బకాయిలు చెల్లించాలని కోరుతూ హైదరాబాద్‌లో ఆందోళన సైతం చేశామని, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



నర్సాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

పెరుగుతున్న వడ్డీలు..

దౌల్తాబాద్ మండలంలో మొత్తం 33 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో పారిశుద్ధ్య నిర్వహణ, వీధిదీపాల ఏర్పాటు, తాగునీటి సరఫరాకు సంబంధించి ముందుగా నిధులు ఖర్చు చేసి, ఆతర్వాత బిల్లులు పెట్టాల్సి ఉంటుంది. వీటితో పాటు మన ఊరు– మనబడి, పల్లెప్రగతి, పనులతో పాటు సీసీ రోడ్లు, డ్రైనేజీలు, రైతువేదికలు, పంచాయతీ భవనాల నిర్మాణాలకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో సర్పంచ్‌లే పనులు చేశారు. డబ్బులు అందక పనులు చేయని వారికి, అధికారులు షోకాజ్ నోటీసులు ఇవ్వడంలాంటి చర్యలకు సైతం పాల్పడ్డారు. తీరా బిల్లుల గురించి అడిగితే మొహం చాటేస్తున్నారని, తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని మాజీలు ఆవేదన వాపోతున్నారు. చిన్న పంచాయతీలకు రూ.5 లక్షలు, పెద్ద పంచాయతీలకు రూ.10లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉందని చెబుతున్నారు.

ఎదురుచూస్తున్నాం..



పంచాయతీకి కోసం వెచ్చించిన పెండింగ్ బిల్లుల కోసం ఎదురుచూస్తున్నాం. సుమారు రూ.8 లక్షల వరకు బకాయిలు ఉన్నాయి. బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం. అప్పుల వడ్డీలు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి బిల్లులు విడుదల చేయాలి.

– శిరీష, మాజీ సర్పంచ్, దౌల్తాబాద్

బకాయిలు చెల్లించాలి



తాజా మాజీ సర్పంచులు పంచాయతీ కోసం అప్పులు చేసి పనులు చేశారు. అప్పట్లో అధికారులు ఒత్తిడి చేసి పనులు చేయించారు. ఇప్పుడు బిల్లులు అడిగితే వస్తాయంటారు. కానీ నేటికి విడుదల కావడంలేదు. అప్పులతో చాలా ఇబ్బందుల్లో ఉన్నాం. వెంటనే బకాయిలు చెల్లించాలి.

– హరికృష్ణ, మాజీ సర్పంచ్, కుప్పగిరి

యువత వ్యాపార రంగాల్లో రాణించాలి

- వినియోగదారుల మన్ననలు పొందాలి
- స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: వ్యాపారం ఏదైనా.. కొనుగోలు, వినియోగదారుల మన్ననలు పొందాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. యువత వ్యాపార రంగంలో రాణించాలని సూచించారు. గురువారం వికారాబాద్ పట్టణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్‌కుమార్ దంపతుల కుమారుడు రాజ్ స్థాపించిన సీఆర్7 ఇన్‌ఫ్రా సంస్థ బ్రౌచర్‌ను ఆయన ఆవిష్కరించారు. దాంతో పాటే అక్కడే నిర్మించిన రెండు మోడల్‌హౌజ్ విల్లాస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికారాబాద్ లాంటి ప్రాంతాల్లో సరికొత్త ఆలోచనలతో నిర్మాణ రంగం రావడం శుభపరిణామమని పేర్కొంటూ.. సంస్థ ఎండీ రాజ్‌ను అభినందించారు. వ్యాపారంలో రాణించి, ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అదే సమయంలో కస్టమర్లకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు నర్సింహులు గుప్తా, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



విల్లాస్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

అంధత్వ నివారణకు కృషి

కొడంగల్ రూరల్: అంధత్వ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని లయన్స్‌క్లబ్ కొడంగల్ అధ్యక్షుడు కె.మురహరి వశిష్ట, లయన్ దాసప్ప యాదవ్ అన్నారు. అందుకు చూపు లోపించిన వారికి.. చూపు తెప్పించేందుకు సహాయం అందించాలని సూచించారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో తెలంగాణ వైద్య విధాన పరిషత్(టీవీవీపీ), లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 39మందికి కంటి నిర్వహించగా, 19 మందికి శస్త్ర చికిత్స నిమిత్తం ఏనుగొండ కంటి ఆస్పత్రికి తరలించారు. మిగతా 20మందికి బీపీ, షుగర్ ఉన్న కారణంగా వచ్చే నెలలో పరీక్షించి, ఆపరేషన్‌కు రెఫర్ చేయనున్నట్లు లయన్ హరినాథ్‌నెహ్రూ తెలిపారు. దృష్టి లోపం ఉన్నవారు ఉచిత కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్ సభ్యులు అశోక్‌కుమార్ కులకర్ణి, శ్రీనివాస్‌గౌడ్, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం.. మహాదానం

గురుస్వామి గిరిషన్ నాయర్

నందిగామ: అన్నదానం మహాదానంతో సమానమని గురుస్వామి గిరిషన్ నాయర్ అన్నారు. మండల పరిధిలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో మండల పూజను పురస్కరించుకొని గురువారం మాలదారులకు కొత్తూరు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మామిడి శ్యాంసుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని గురుస్వామి ప్రారంభించారు. అనంతరం అన్నదాత శ్యాంసుందర్‌రెడ్డిని గురుస్వాములు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గురుస్వాములు సుదర్శన్, అశోక్, హరిజీవన్, నర్సింహ, చించేటి కృష్ణ, కుమార్ గౌడ్, శ్రీకాంత్, నవీన్‌చారి, లింగం పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో..

షాబాద్: మండల పరిధిలోని కొమరబండ గ్రామానికి చెందిన గురుస్వామి రవీందర్ రెడ్డి గురువారం 24వ పడిపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అదేవిధంగా కేసారం గ్రామానికి చెందిన గురుస్వామి తొంట రాంచందర్ 17వ పడిపూజ విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా అయ్యప్ప నామస్మరణలతో రెండు గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది.

ప్రజా సమస్యలపై సీపీఐ పోరాటం

పరిగి: ప్రజల సమస్యల పరిష్కారానికి సీపీఐ నిరంతర పోరాటం చేస్తుందని పార్టీ డివిజన్ కార్యదర్శి పీర్‌మహమ్మద్ అన్నారు. గురువారం భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా పట్టణంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. భూమికోసం భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం ఆవిర్భవించిన పార్టీ సీపీఐ అని పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలమవుతున్నాయని ఆరోపించారు. ఈ నెల 30న నల్లగొండలో జరిగే ఆవిర్భావ బహిరంగ సభలో పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొని, జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి వెంకటేశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వార్షికోత్సవంలో నాయకులు

రూ.3 కోట్ల నిధులతో సొసైటీ అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ వెంకట్ రాంరెడ్డి

- తక్కువ వడ్డీతో బంగారంపై రైతులకు రుణాలు
- పీఏసీఎస్ చైర్మన్ వెంకట్ రాంరెడ్డి

బషీరాబాద్: రూ.3 కోట్లతో నావంద్గీ సొసైటీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నానని చైర్మన్ వెంకట్ రాంరెడ్డి తెలిపారు. గురువారం పాలకవర్గ సమావేశంలో పలు అభివృద్ధి పనులకు సభ్యులు తీర్మానం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. సొసైటీ ఆధ్వర్యంలో ఇప్పటికే గోదాం, నూతన కార్యాలయం, పెట్రోల్ బంక్ పనులు ప్రారంభించామన్నారు. పాత భవనం స్థానంలో కొత్తగా గోదాం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, ఇది రైతుల ధాన్యం నిల్వలకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సొసైటీలో బంగారంపై రైతులకు తక్కువ వడ్డీరేటుతో రుణాలు ఇస్తున్నామని, ఇతర బ్యాంకుల కంటే ఎక్కువగా తులం బంగారానికి అత్యధికంగా రూ.45 వేలు ఇస్తున్నామని వివరించారు. సిబ్బంది చొరవతో చేపట్టిన పనులతో సొసైటీ లాభాలను ఆర్జించిందని చెప్పారు. మండల పరిధి రైతులకు పంట రుణాలు ఇచ్చామని వెల్లడించారు. సమావేశంలో వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్, సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, అశోక్ గౌతమ్, రంగారెడ్డి, గోపాల్, నవీన్ రెడ్డి, హన్మంత్‌రెడ్డి, సీఈఓ బందెప్ప, రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

కేశంపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నాగిళ్ల భాస్కర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నాయకులతో కలిసి ఆయన అంబేడ్కర్ చౌరస్తా నుంచి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. మొదటగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ నర్సింలుశెట్టికి అమిత్‌షాపై ఫిర్యాదు చేశారు. అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను కేంద్ర మంత్రి పదవి నుంచి తొలగించాలన్నారు. బీజేపీ దేశప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రూప్లానాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భాస్కర్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

క్రమబద్ధీకరిస్తేనే.. విరమిస్తాం



బొంరాస్‌పేట: దీక్షలో సమగ్రశిక్ష ఉద్యోగులు

- సమగ్రశిక్ష ఉద్యోగుల వెల్లడి
- కొనసాగుతున్న ధర్నా

బొంరాస్‌పేట: తమను విద్యాశాఖలో విలీనం చేయడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే వరకూ దీక్ష విరమించేది లేదని సమగ్రశిక్ష ఉద్యోగులు స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం బొంరాస్‌పేటతో పాటు కొడంగల్ నుంచి సీఆర్‌పీలు, ఎమ్మార్సీ సిబ్బంది, కేజీబీవీ ఉద్యోగులు, యూఆర్ఎస్, డీపీఓ సిబ్బంది వికారాబాద్‌లో నిర్వహించిన సమ్మెకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు తమ సమస్యలు వివరించామని, ఆయన సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ ఉద్యోగులు గౌసొద్దీన్, రాఘవేందర్, వెంకటయ్య, సీఆర్‌పీలు రాందాస్, బావుసింగ్, శ్రీనివాస్, దస్తప్ప, సోమ్లా తదితరులు పాల్గొన్నారు.



దౌల్తాబాద్: మూతబడిన ఎమ్మార్సీ కార్యాలయం

సమ్మెలో సిబ్బంది.. కదలని పనులు

దౌల్తాబాద్: తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని కోరుతూ.. సమగ్రశిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఎమ్మార్సీలో పనిచేసే ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, సీసీఓలు, సీఆర్పీలు, మెస్సెంజర్లు సమ్మెలో పాల్గొంటున్నారు. దీంతో మధ్యాహ్న భోజన బిల్లులు, ఆన్‌లైన్ నమోదు తదితర పనులు ఆగిపోయాయి. మెస్సెంజర్లు సమ్మెలో పాల్గొనడంతో కార్యాలయం గేటు తాళం తీసేవారు కూడా లేరు. వీరితో పాటు కేజీబీవీ సిబ్బంది కూడా ధర్నాలో పాల్గొంటున్నారు.

గడ్డం శైలజకు నేతల నివాళి



వికారాబాద్: అన్నదానం చేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్ తదితరులు

అనంతగిరి: స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సతీమణి శైలజ 4వ వర్ధంతి సందర్భంగా గురువారం వికారాబాద్‌పట్టణంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ ఎదుట అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్పీకర్.. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల, మాజీ చైర్మన్ సత్యనారాయణ, డీసీసీబీ డైరెక్టర్ కిషన్‌నాయక్, సీనియర్ నాయకులు అనంత్‌రెడ్డి, నరోత్తంరెడ్డి, రాంచంద్రారెడ్డి, ధారూర్ మార్కెట్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. మోమిన్‌పేట, బంట్వారం, మర్పల్లి, ధారూరులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శైలజ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు ఆమె చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి భీంభరత్

షాబాద్: కార్యకర్తలు పార్టీ బలోపేతం చేసేందుకు సైనికుల్లా పనిచేయాలని పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. గురువారం మండల పరిధిలోని నాగర్‌గూడ పీఎస్ఆర్ గార్డెన్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో రైతులు సుభిక్షంగా ఉంటారని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రతి నిరుపేదకు అందాలన్నారు. కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం మహిళలకు వరం లాంటిందని, మహిళా సాధికారత కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. త్వరలో మిగిలిన గ్యారంటీలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఈ నెల 28వ తేదీన సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావు, సీతక్క, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్ తదితరులు హాజరవుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీశ్, పీసీసీ కార్యదర్శి ఎస్.రాంరెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు మంగలి చెన్నయ్య, నర్సింహులు, యూత్ అధ్యక్షుడు సురేందర్, నాయకులు ఉన్నారు.



మాట్లాడుతున్న భీంభరత్

నేడు ఎమ్మెల్యే పర్యటన

కేశంపేట: మండలంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శుక్రవారం పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్ తెలిపారు. మండలంలోని ఎక్లాస్‌ఖాన్‌పేట, బైర్కాన్‌పల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన, కొత్తపేటలో అదనపు తరగతి గదులకు శంకుస్థాపన, కేశంపేటలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో కల్యాణలక్ష్మీ, షాదీముబారఖ్ చెక్కుల పంపిణీ చేస్తారని తెలిపారు. అనంతరం వేములనర్వ గ్రామ శివారులోని నంబయ్యగుట్టపై ఉన్న వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొంటారని ఆయన తెలిపారు. ఆయా గ్రామాల్లో ప్రజలతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వంతెన.. ఇంతేనా!



వర్షాలకు దెబ్బతిన్న బాస్‌పల్లి, గొడుగోనిపల్లి కల్వర్టు

- భారీ వర్షాలకు దెబ్బతిన్న బాస్‌పల్లి– గొడుగోనిపల్లి కల్వర్టు
- రెండేళ్లుగా మరమ్మతులకు నోచుకోని వైనం
- వంతెన వద్ద గుంతలు పడిన రహదారి
- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు

దోమ: నిత్యం వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే కల్వర్టులు దెబ్బతిని ప్రమాదకంగా మారుతున్నాయి. దీంతో ఏ క్షణం ఏం జరుగుతుందో తెలియని పరిస్థితిలో ప్రయాణం సాగిస్తున్నారు. గత రెండేళ్లుగా కురిసిన వర్షలతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. దీంతో మండల పరిధిలోని బాస్‌పల్లి, గొడుగోనిపల్లి సమీపంలోని పరిగి, మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు ధ్వంసమైంది. దీంతో అటుగా ప్రయాణించే వాహనదారులు, ప్రయాణికులు ఇక్కడ తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల వాహనదారులు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

చాలా సార్లు ఫిర్యాదు చేశాం



కల్వర్టు తెగి రెండేళ్లు కావస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ విషయమై ఎన్నోసార్లు ఫిర్యాదు చేశాం. కల్వర్టు సమీపంలో రహదారి గుంతలుగా మారడంతో ద్విచక్ర వాహనదారులు కింద పడి గాయాల పాలవుతున్నారు. ఇప్పటికైనా కల్వర్టును బాగు చేయాలి.

– జహీర్, గొడుగోనిపల్లి

అధికారుల నిర్లక్ష్యమే..

కల్వర్టు తెగిపోయిన విషయం పలుమార్లు అధికారులకు విన్నవించినా వారు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు నాగిరెడ్డి, మాజీ ఎంపీపీ మల్లేశం గతంలోనే ఈ వంతెనను పరిశీలించారు. వెంటనే పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అయినా అధికారుల్లో చలనం రాలేదు. పరిగి నుంచి మహబూబ్‌నగర్ వెళ్లేందుకు ఇదే ప్రధాన దారి కావడంతో రాత్రి వేళ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షాలు కురిస్తే కల్వర్టు కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.